క్లుప్తంగా

జ్ఞాన సరస్వతి ఆలయంలో చండీహోమం



చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

కొవ్వూరు: పౌర్ణమి సందర్భంగా స్థానిక గోష్పాద క్షేత్రంలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో ఆదివారం చండీహోమం నిర్వహించారు. రాజమహేంద్రవరానికి చిరవూరి సుబ్రహ్మణ్యం, రమాదేవి దంపతుల చేతులమీదుగా పూజలు నిర్వహించారు. ముందుగా గణపతి పూజ, మంటపారాధన, కలశ పూజ, చండీ పరాదేవతకు అష్టోత్తర పూజ నిర్వహించారు. ఆత్మీయ హితకారిణీ సమాజం నిర్వాహకురాలు నళిని వాజ్‌పేయ్ పూజలను పర్యవేక్షించారు. వాడ్రేపు సాయి కామరాజు, చామర్తి విశ్వనాథరావు, ముష్టి శ్రీరామచంద్రమూర్తి, గంపా కృష్ణారావు, అప్పల అయ్యపురాజు, తిప్పాభొట్ల సుబ్రహ్మణ్యశాస్త్రి, బాలప్ప రుక్మాంగధరరావు తదితరులు పాల్గొన్నారు.

ధనుర్మాస యాత్రకు ప్రత్యేక బస్సులు

కొవ్వూరు: ధనుర్మాసాన్ని పురస్కరించుకుని కొవ్వూరు ఆర్టీసీ డిపో నుంచి కాకినాడ సమీపంలోని వారాహి మాత, పెద్దాపురం మండలంలోని తొలి తిరుపతి యాత్రకు ఆదివారం రెండు ప్రత్యేక బస్సులను పంపించినట్టు డిపో మేనేజర్ వైవీవీఎస్ కుమార్ తెలిపారు.వాటితో పాటు పారిజాతాలు, సప్త శ్రీనివాసాలు, శివకేశవ దర్శినికి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు ఆయన వివరించారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకోవాలని ఆయన కోరారు.

భక్తాంజనేయ ఆలయంలో పూజలు



విశేష అలంకరణలో చాగల్లు భక్తాంజనేయ స్వామి

చాగల్లు: హనుమాన్ వ్రత మహోత్సవాల్లో భాగంగా ఆదివారం చాగల్లు భక్తాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పురోహితులు శివసీతారామ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ఉదయం పంచామృతాలు, చామంతి పూలతో రుద్రాభిషేకాలు, సింధూరార్చన నిర్వహించారు.

హనుమాన్ చాలీసా పారాయణ

భక్తంజనేయ స్వామి ఆలయ కమిటీ, విశ్వహిందూ పరిషత్, హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం సామూహిక హనుమాన్ చాలీసా పారాయణ నిర్వహించారు. రాజరాజేశ్వరీ విద్యాలయం మరియు ఏసీవీ ఆర్ కే స్కూల్ విద్యార్థులు హనుమాన్ చాలీసా పారాయణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వచ్చిన భక్తులకు హనుమాన్ చాలీసా పారాయణ పుస్తకాలు, రక్షా బంధనం, హనుమాన్ డాలర్ జెండాలను బహూకరించారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శన చేస్తున్న బాలికలు

తాళ్లపూడి: వేగేశ్వరపురంలోని అభయాంజనేయ ఆలయం వద్ద హనుమద్రత్వ ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. అర్చకుడు పెరవలి సాయి ఆధ్వర్యంలో ఆదివారం తమలపాకులు, సింధూరంతో పూజలు నిర్వహించారు. శనివారం రాత్రి తణుకుకు చెందిన మహానట కళామందిర్ వారిచే కూచిపూడి, జానపద నృత్య ప్రదర్శన జరిగింది. తమ గురువు కె.కామేష్ ఆధ్వర్యంలో చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి, జానపద నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

వైభవంగా దత్తాత్రేయ జయంతి



దత్తాత్రేయుడు

నిడదవోలు: స్థానిక బాలాజీనగర్‌లోని దత్తసాయి పీఠంలో ఆదివారం దత్త జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. దత్తసాయి పీఠం నిర్వాహకుడు సురేష్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళా మార్ట్‌కు కూటమి పోటు!

- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- నష్టాల దిశగా పయనం
- అయోమయంలో మహిళా సంఘాలు



నల్లజర్ల మహిళా మార్ట్‌లో అందుబాటులో ఉన్న నిత్యావసరాలు

నల్లజర్ల: జిల్లాలోనే రెండవదిగా ప్రారంభమైన నల్లజర్ల వైఎస్సార్ చేయూత మహిళామార్ట్ నేడు వెలవెలబోతోంది. గత ప్రభుత్వ హయాంలో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన ఈ స్టాల్ పర్యవేక్షణ కొరవడంతో ప్రస్తుతం నష్టాల వైపు పయనిస్తోంది. మొత్తం 20,330 మంది సభ్యులతో 2,023 సంఘాలతో రూ.50.81 లక్షల పెట్టుబడి వ్యయంతో ఈ మార్ట్‌ను అట్టహాసంగా ప్రారంభించారు. సంఘ సభ్యుల నుంచి ఈ మొత్తాన్ని సేకరించి పెట్టుబడిగా పెట్టారు. కమిటీ పర్యవేక్షణలో మార్ట్‌ను నిర్వహించి, వచ్చిన లాభాలను ఏడాదికొకసారి సభ్యులకు పంచాలి. ప్రారంభంలో మార్ట్‌కు అవసరమైన సామగ్రిని ఏర్పాటు చేసి విక్రయాలు ప్రారంభించారు. రోజూ రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకూ విక్రయాలు జరిగేవి. ఆరుగురు మహిళలకు ఉపాధి లభించింది. దీంతో పాటు మహిళా సంఘాల ఆధ్వర్యంలో తయారయ్యే ఉత్పత్తుల విక్రయాలు కూడా ఇక్కడ జరిగేవి. తద్వారా ప్రజలకు నాణ్యమైన సరకులు సరసమైన ధరలకు అందేలా చర్యలు తీసుకున్నారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మార్ట్‌కు ప్రజల నుంచి కూడా మంచి ఆదరణ లభించింది. దాంతో నల్లజర్లలోని ప్రైవేట్ దుకాణాలలో వ్యాపారాలు తగ్గాయి. అయితే మార్ట్‌కు మంచి ఆదరణ రావడం టీడీపీ వర్గీయులకు మింగుడు పడడం లేదు. దీంతో మార్ట్‌ను నిర్వీర్యం చేసి, మూసివేసే దిశగా వెలుగు సిబ్బంది, మహిళా సంఘాలపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తీసుకు వస్తున్నట్టు చెబుతున్నారు.

విద్య,వైద్యానికి తగ్గిన ప్రాధాన్యం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు ప్రాధాన్యం తగ్గించి మద్యం వ్యాపారానికి పెద్దపీట వేసింది. మార్ట్‌లో అమ్మకాలు సగానికి తగ్గాయి. మహిళా సాధికారతను దెబ్బతీసేలా పరోక్షంగా మహిళా మార్ట్‌ను మూసివేసేందుకు పక్కాగా స్కెచ్ వేసినట్టు మహిళా సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఇందులో భాగంగా మార్ట్ నష్టాల్లో నడుస్తున్నట్టు ఆడిటింగ్‌లో చూపించే ప్రక్రియ జరుగుతున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఇటువంటి ప్రతికూల పరిస్థితులు నెలకొనడంతో దీని నిర్వహణ గందరగోళంగా మారింది. ఫలితంగా మార్ట్ నిర్వహణ వెలుగు సిబ్బందికి, మహిళా సంఘాలకు ఇబ్బందికరంగా మారినట్టు చెబుతున్నారు.

మార్ట్ అభివృద్ధికి కృషి చేయాలి



మహిళా మార్ట్ ప్రారంభించాక సరకులు సరసమైన ధరలకే లభిస్తున్నాయి. మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి గత ప్రభుత్వం మహిళా మార్ట్‌లను ప్రోత్సహించింది. అలాంటి మహిళా మార్ట్‌లను మూసివేసే దిశగా కూటమి ప్రభుత్వం కక్ష సాధింపులకు దిగి, అధికారులను బెదిరిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి.అధికారులు స్పందించి మార్ట్ అభివృద్ధికి కృషి చేయాలి.

– వామిశెట్టి పావనీకుమారి, ఎంపీటీసీ సభ్యురాలు, సింగరాజుపాలెం

విక్రయాలు పెరిగేలా చర్యలు



మార్ట్‌లో విక్రయాలు తగ్గిన మాట వాస్తవమే. విక్రయాలు పెరిగేలా నూతన సంవత్సర, సంక్రాంతి పండగలకు ప్రత్యేక ఆఫర్లు పెడుతున్నాం.అద్దె, నిర్వహణ ఖర్చులు పెరగడంతో సిబ్బందిని తగ్గించాం. మార్ట్‌ను లాభాల వైపు నడిపించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– శ్యాంసుందర్, ఐకేపీ ఏపీఎం, నల్లజర్ల

తెరచుకున్న ఇసుక ర్యాంపులు

తీరనున్న భవన నిర్మాణదారుల వెతలు



తీపర్రు ర్యాంపులో లారీకి ఇసుక లోడింగ్ చేస్తున్న పొక్లెయిన్

పెరవలి: నిడదవోలు నియోజకవర్గంలోని ఇసుక ర్యాంపులు ఎట్టకేలకు తెరుచుకున్నాయి. 22 రోజుల పాటు మూతపడిన ర్యాంపులు రెండు రోజులుగా ఇసుక తవ్వకాలు జరిపి ఎగుమతులు ప్రారంభించాయి. నియోజకవర్గంలో కానూరు–పెండ్యాల, తీపర్రు, పందలపర్రు, జీడిగుంట ఇసుక ర్యాంపులు ఉన్నాయి. వాటిలో మెషీన్‌తో ఇసుక తవ్వకాలు జరపడంతో జీడిగుంట ఇసుక ర్యాంపును మూసివేశారు. ధాన్యం మాసూళ్లు జరుగుతున్నందున రైతుల విజ్ఞప్తి మేరకు పందల పర్రు, కానూరు–పెండ్యాల ర్యాంపులను మూసివేశారు. గోదావరి నీరు వచ్చి మునిగిపోయిన కారణంగా తీపర్రు ర్యాంపును మూసివేశారు. దీంతో ఇసుకకు కొరత ఏర్పడి నియోజకవర్గంలోని నిర్మాణదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పరిస్థితులన్నీ చక్కబడడంతో మూతపడిన ర్యాంపులన్నింటినీ ఇప్పుడు తెరిచారు. ఇక నుంచి ఇసుక కొరత తీరి నిర్మాణాలు వేగం పుంజుకోవచ్చంటున్నారు.

స్వర్ణోత్సవ ఆర్ఎంపీకి సన్మానం



రామకృష్ణను సన్మానించిన మునిపల్లి గ్రామ నాయకులు

నిడదవోలు రూరల్: మునిపల్లి గ్రామంలో శ్రీనివాసా ఫస్ట్ ఎయిడ్ సెంటర్ ఏర్పాటు చేసి 50 ఏళ్లుగా పేదలకు ఉచితంగా వైద్యసేవలు అందిస్తున్న ఆర్ఎంపీ వైవీఎస్ రామకృష్ణ సేవలు అభినందనీయమని సర్పంచ్ వెలగన నరేష్ కొనియాడారు. శ్రీనివాసా ఫస్ట్ ఎయిడ్ సెంటర్ 50వ వార్షికోత్సవం సందర్భంగా రామకృష్ణను గ్రామస్తులు ఆదివారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ వెలగన పోలయ్య, నాయకులు జుజ్జవరపు వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, కరుటూరి రామకృష్ణ, నాగేశ్వరరావు, సుంకవల్లి రామారావు, మధుబాబు, పాస్టర్ జాన్, జి.ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడు

- అమరజీవి వర్ధంతి
- నివాళి అర్పించిన ప్రజాప్రతినిధులు, నాయకులు, ఆర్యవైశ్య సంఘ నేతలు



కొవ్వూరులో పొట్టి శ్రీరాముల విగ్రహం వద్ద పేదలకు దుప్పట్లు పంచుతున్న ఎమ్మెల్యే ముప్పిడి



అనంతపల్లిలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఎమ్మెల్యే వెంకట్రాజు,ఆర్యవైశ్య ప్రముఖుల నివాళి

కొవ్వూరు: రాష్ట్ర అవతరణ కోసం ప్రాణ త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం ఆయన వర్ధంతి సందర్భంగా కొవ్వూరు మెయిన్ రోడ్డులోని శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పొట్టి శ్రీరాములు వర్ధంతిని రాష్ట్ర ప్రభుత్వం ఆత్మార్పణ దినోత్సవంగా ప్రకటించడం హర్షణీయం అన్నారు. అనంతరం ఎమ్మెల్యే చేతులమీదుగా పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంఠమణి రామకృష్ణ, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మట్టే ప్రసాద్, కార్యదర్శి కొల్లేపర శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

నల్లజర్ల: అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగంతో సాధించిన రాష్ట్రంలో అందరం కలసికట్టుగా ప్రగతి సాధించడమే ఆయనకు మనమిచ్చే నిజమైన ఘన నివాళి అని పలువురు వక్తలు పేర్కొన్నారు. నల్లజర్ల మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం అనంతపల్లి ఆర్యవైశ్య కల్యాణ మంటపం వద్ద ఆత్మార్పణ దినం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, ఆర్యవైశ్యసంఘ రాష్ట్ర అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు వెలగా శ్రీరామ్మూర్తి ముఖ్య అతిథులుగా హాజరై అమరజీవి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్యవైశ్యులకు ప్రత్యేక కల్యాణ మంటపం ఏర్పాటు చేస్తామన్నారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు

ఆర్యవైశ్య సంఘం మండలశాఖ నూతన అధ్యక్షుడిగా కాజు భద్రయ్య, గౌరవాధ్యక్షుడిగా గుళ్ళపూడి వెంకటరత్నం, ఉపాధ్యక్షుడిగా పచ్చిగోళ్ళ శ్రీనివాస్, కార్యదర్శిగా శీమకుర్తి ధర్మనాగేంద్రకుమార్, కోశాధికారిగా మాజేటి శ్రీనివాస్ ఎంపికయ్యారు. వారితో రాష్ట్ర అధ్యక్షుడు ప్రమాణ స్వీకారం చేయించి గుర్తింపు పత్రాలు అందజేశారు.

గోపాలపురం: స్థానిక బస్‌స్టాండ్ సెంటర్లోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్యులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండల శాఖ అధ్యక్షుడు సుతాపల్లి శ్రీనివాస్, మద్దు జగన్‌మోహన్‌రావు, గుబ్బా శ్రీను, కొల్లూరి సత్రయ్య, మద్దు నాగభూషణం,రామభాస్కరరావు ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

నిడదవోలు: పట్టణంలోని పొట్టి శ్రీరాములు విగ్రహం సెంటర్‌లో పట్టణ ఆర్యవైశ్య సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పొట్టి శ్రీరాములు వర్ధంతిని నిర్వహించారు. పొట్టి శ్రీరాములు విగ్రహానికి మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమలో పట్టణ ఆర్యవైశ్య సేవా సంఘ అధ్యక్షుడు కేదారిశెట్టి రవికుమార్, వలివేటి సుబ్బారావు, గ్రంధి బాలాజీ, కంకిపాటి వెంకటేశ్వరరావు, జయవరపు గోపాలకృష్ణ, కేదారిశెట్టి కాశివిశ్వనాథం, జయవరపు మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి: ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవ వేడుకలను ఆదివారం దేవరపల్లిలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆర్యవైశ్య కల్యాణ మంటపం వద్ద గల అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పొట్టి శ్రీరాములు పవిత్ర స్మృతి పరిరక్షణ సమితి జాతీయ ఉపాధ్యక్షులు శ్రీకాకొళపు కాళీకృష్ణ, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కొత్తగుండ బాబూరావు, యువజన సంఘం అధ్యక్షులు రామారావు, పలువురు ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

చాగల్లు: మండలంలోని చాగల్లు, చంద్రవరం శాఖా గ్రంథాలయాల వద్ద ఆదివారం పొట్టి శ్రీరాముల చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు పొట్టి శ్రీరాములు జీవిత చరిత్ర గురించి వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారులు జి.శ్రీనివాసరావు, కె.సుమన్ కుమార్, రీడర్స్ ఫోరం సభ్యులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: అమరజీవి పొట్టి శ్రీరాములు, సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతులను పురస్కరించుకుని ఉండ్రాజవరం స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం వారిద్దరి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు గుత్తికొండ కృష్ణారావు, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు ఆకెళ్ల శ్రీనివాస్, పాఠకులు పాతూరి సుబ్బారావు, సింహాద్రి రామచంద్ర రావు, కేవీ కృష్ణారావు, జి.బాలాజీ, ఆలపాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కోటసత్తెమ్మ తిరునాళ్లు ప్రారంభం



కలశస్థాపన పూజలతో అమ్మవారి తిరునాళ్లు ప్రారంభిస్తున్న చైర్మన్ రవిశంకర్ దంపతులు, ధర్మకర్తల మండలి సభ్యులు

నిడదవోలు రూరల్: మండలంలోని తిమ్మరాజుపాలెంలో కొలువైన కోటసత్తెమ్మ వారి తిరునాళ్లు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయం వద్ద ఆదివారం ఉదయం ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్, చైర్మన్ దేవులపల్లి రవిశంకర్ దంపతుల కలశస్థాపనతో ఉత్సవాలను ప్రారంభించారు. అమ్మవారికి లక్ష కుంకుమార్చన, ఏకాదశ రుద్రాభిషేకాలు, మహాలింగార్చన సూర్య నమస్కారాలు, మహాన్యాస పఠం నిర్వహించారు. ఉదయం చండీ పారాయణం, సాయంత్రం హోమం చేశారు. అమ్మవారికి ఆలయ ప్రధానార్చకుడు అప్పారావు శర్మ ప్రత్యేక పూజలు జరిపించారు. అమ్మవారి దర్శనానికి వివిధ రూపాల్లో రూ.95,498 ఆదాయం వచ్చినట్టు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ వి.హరి సూర్యప్రకాశ్ తెలిపారు.

ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన



ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న భాస్కరరావు కుటుంబ సభ్యులు

ఉండ్రాజవరం: చివటం గ్రామంలోని పుంతలో ముసలమ్మ, కనకదుర్గమ్మ ఆలయ పునర్నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన జరిగింది. గ్రామానికి చెందిన గమిడి భాస్కరరావు కుటుంబ సభ్యులైన గమిడి రామ నాగేశ్వరరావు–సీతా సుగుణ, శ్రీను–శ్యామల, చలంచర్ల శ్రీనివాసు–దేవి దంపతులు శంకుస్థాపన పూజలు నిర్వహించారు. జీర్ణావస్థకు చేరుకున్న ఈ ఆలయం స్థానంలో నూతన ఆలయానికి శంకుస్థాపన, విగ్రహావిష్కరణకు గమిడి భాస్కరరావు కుటుంబ సభ్యులు రూ.3 లక్షల ఆర్థిక సహాయం చేశారు. ఈ ఆలయం చివటం ప్రధాన రహదారిని అనుకుని ఉండేది.రోడ్డు విస్తరణతో ఈ ఆలయాన్ని తొలగించి, నూతన ఆలయ నిర్మాణానికి గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు సంకల్పించారు. రూ.25 లక్షల అంచనా వ్యయంతో ఈ ఆలయ నిర్మాణం చేపట్టారు. వచ్చే ఏడాది మే లో నిర్వహించే జాతర నాటిని నూతన ఆలయాన్ని పునః ప్రారంభించడానికి కృషి చేస్తున్నట్టు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు తెలిపారు.

మానవత సంస్థకు ఫ్రీజర్ బహూకరణ



మానవత సంస్థకు ఫ్రీజర్ అందజేస్తున్న దాతలు కొండేపాటి రత్నాజీ దంపతులు

గోపాలపురం: మానవత స్వచ్ఛంద సంస్థ మండల శాఖకు చిట్యాల గ్రామానికి చెందిన కొండేపాటి రత్నాజీరావు దంపతులు ఆదివారం రూ. 85 వేల విలువైన ఫ్రీజర్‌ను బహూకరించారు. ఈ కార్యక్రమంలో మానవత సంస్థ మండల శాఖ చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు, అధ్యక్షుడు పప్పు సత్యకృష్ణారెడ్డి, బలుసు సత్యనారాయణ, గెడ జోగేంద్రప్రసాద్, కె.కీర్తికుమార్, మద్దిపాటి గంగరాజు, ఆ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

దేవరపల్లిలో క్రిస్మస్ వేడుకలు

దేవరపల్లి: క్రిస్మస్ వేడుకలను ఆదివారం రాత్రి దేవరపల్లిలో ఘనంగా నిర్వహించారు. దేవరపల్లి–గోపాలపురం రోడ్డులోని డైమండ్ జంక్షన్‌కు సమీపంలో గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయిలో క్రిస్మస్ వేడుకలు ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి క్రైస్తవులు, దైవసేవకులు, పాస్టర్లు భారీగా తరలి వచ్చి ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి స్వభావాన్ని కోరుకొనేది మతమన్నారు. ఏటా క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తానని ఆయన ప్రకటించారు. ఈ వేడుకల్లో అంతర్జాతీయ ప్రసంగీకులు అల్లూరి విశ్వప్రసాద్ దైవవర్తమానం అందించారు. దైవసేవకులు ఈదూరి దేవిడ్, కళానిధి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి డి.సువర్ణరాజు, పాస్టర్లు, భక్తులు పాల్గొన్నారు.

కరాటేలో తపస్విరెడ్డికి డబుల్ గోల్డ్



పతకాలు అందుకుంటున్న తపస్విరెడ్డి

నిడదవోలు: పశ్చిమ గోదావరి జిల్లా తణుకు పట్టణంలోని అక్కాయమ్మ కళావేదికలో ఆదివారం నిర్వహించిన కరాటే పోటీల్లో నిడదవోలుకు చెందిన తపస్విరెడ్డి ప్రతిభ కనబరిచాడు. జాతీయస్థాయిలో సెయికో షోటోకాన్ అడ్వాన్స్‌డ్ కరాటే దు ఇండియా ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. ఇంటర్ స్టేట్ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ –2024 అండర్– 14 బ్లాక్‌బెల్ట్ కటా, కుమిటే పోటీలలో తపస్విరెడ్డి ప్రథమ స్థానంలో నిలిచి రెండు బంగారు పతకాలు సాధించాడు. తపస్విరెడ్డిని పలువురు అభినందించారు.

బహిరంగ వేలం ప్రకటన
మహారాజ శ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు–తణుకు
E.P.16/22 in O.S.215/19
పిటీషనరు & డి.హెచ్.ఆర్. : ముదునూరి శ్రీనివాసరాజు
వగైరా
రెస్పాండెంటు & జె.డి.ఆర్ : తానింకి సుబ్రహ్మణ్యం బాలాజీ
... తేదీ 02.01.2025 ... 10.30 ని ...
... హెచ్.డి.ఆర్. విలువ : 10,00,000/- అధికా విలువ : 30,00,000/-
... : 24,48,000/-
ది.15-12-2024 తణుకు — భూపతిరాజు సుబ్బరాజు అడ్వకేట్, తణుకు – సెల్ : 94401 04986

మెట్టలో దాళ్వా వరినాట్లు ప్రారంభం



దేవరపల్లి మండలం దుద్దుకూరులో వేస్తున్న దాళ్వా వరినాట్లు



నల్లజర్ల మండలంలో దాళ్వా వరి నారుమడి

- బోర్ల కింద సిద్ధమైన నారుమడులు
- నెలాఖరుకు జోరందుకునే అవకాశం

దేవరపల్లి: మెట్ట ప్రాంతమైన గోపాలపురం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో దాళ్వా వరి నాట్లు ప్రారంభమయ్యాయి. రైతులు ముందుగానే బోర్ల కింద వరి ఆకుమడులు పోసి నారు సిద్ధం చేశారు. నియోజకవర్గంలో దాళ్వా వరి సాగు పూర్తిగా బోర్లపై ఆధారపడి జరుగుతుంది. వారం రోజులుగా వరి నాట్లకు దేవరపల్లి, నల్లజర్ల మండలాల రైతులు శ్రీకారం చుట్టారు. దాళ్వా సాధారణ సాగు విస్తీర్ణం మండలాలవారీగా గోపాలపురంలో 1874, దేవరపల్లిలో 2771, నల్లజర్లలో 2748 హెక్టార్లు. దాళ్వాలో ఎకరాకు 50 నుంచి 60 బస్తాల ధాన్యం దిగుబడులను రైతులు సాధిస్తున్నారు. అధిక దిగుబడులు ఇచ్చే ఎంటీయూ 1121, 1153, 1156 వంగడాలను మెట్ట ప్రాంత రైతులు సాగు చేస్తున్నారు. ఎక్కువ మంది రైతులు ఎంటీయూ 1121 వంగడాన్ని సాగు చేస్తున్నట్టు వ్యవసాయాధికారులు తెలిపారు. ఈ వంగడాల కాల పరిమితి 120 రోజులు. సాటి రైతుల నుంచి కొనుగోలు చేసి విత్తనాలనే దాళ్వాలో పంట సాగు చేస్తున్నారు. ఈ నెలాఖరుకు నాట్లు ఊపందుకుంటాయని అధికారులు తెలిపారు. దేవరపల్లి మండలంలో దుద్దుకూరు, గౌరీపటన్నం, యర్నగూడెం, సూర్యనారాయణపురం, త్యాజంపూడి, నల్లజర్ల మండలంలోని అనంతపల్లి, నల్లజర్ల గ్రామాల్లోని పలు ప్రాంతాల్లో వరినాట్లు జరుగుతున్నాయి.

నల్లజర్ల మండలంలో 8,343 ఎకరాల్లో..

నల్లజర్ల: మండల రైతులు రబీ వరి నాట్లు ప్రారంభించారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వరుణుడు రైతన్నలకు కొంత ఇబ్బంది కల్గించాడు. అయినప్పటికీ మాసూళ్ల సమయంలో ప్రకృతి సహకరించడంతో పనులు సజావుగా పూర్తి చేశారు.ఈసీజన్‌లో వరి పంట ఆశాజనకంగానే ఉంది. ఎకరాకు 36 నుంచి 38 బస్తాల వరకూ ధాన్యం దిగుబడి వచ్చింది.

బోర్లు కింద నాట్లు వేస్తున్నారు



వ్యవసాయ బోర్ల క్రింద దాళ్వా నాట్లు వేస్తున్నారు. ముందుగా వేసిన వరి ఆకుమడులు నాటడానికి సిద్ధంగా ఉండడంతో పలు గ్రామాల్లో నాట్లు ప్రారంభించారు. అధిక దిగుబడులు ఇస్తున్న ఎంటీయూ 1121 వంగడాన్ని రైతులు సాగు చేస్తున్నారు. ఖరీఫ్ కోతలు దాదాపు పూర్తయ్యాయి. ఎప్పటి ధాన్యాన్ని అప్పుడు ఇబ్బంది లేకుండా రైతులు అమ్ముకున్నారు. రైతులకు ఖరీఫ్ పంటకు మంచి ధర లభించింది. దిగుబడులు ఎకరాకు 30 నుంచి 35 బస్తాలు వచ్చింది.

– కె. విజయ్, మండల వ్యవసాయాధికారి, దేవరపల్లి

దాళ్వాలో..

ఎంటీయూ–1121 శ్రీధృతి, 1010,ఎస్ ఎల్–10 రకాలను రైతులు ఎంపిక చేసుకుంటున్నారు. ప్రకాశరావుపాలెం, అచ్చన్నపాలెం, అనంతపల్లి గ్రామాల్లో వరినాట్లు వడివడిగా జరుగుతున్నాయి.అదేవిధంగా 4,600 ఎకరాలలో మొక్కజొన్న వేశారు. ఇందులో 254 ఎకరాలలో సీడ్‌కు మొక్కజొన్న వేశారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, సంస్మరణ, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నిడదవోలు డివిజన్
90102 34548 (కొవ్వూరు)
90100 51493 (నిడదవోలు)
90100 68395 (గోపాలపురం)
Office mail : tpgadvt@gmail.com